క్లుప్తంగా

నేడు పిన్నెల్లిలో ఎమ్మెల్యే పర్యటన

మాచవరం: మండలంలోని పిన్నెల్లి గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పర్యటించనున్నారు. ప్రజావేదిక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని ఇన్‌చార్జి ఎంపీడీఓ ప్రసాద్ తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై వంద రోజులు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు.

24న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

మాచవరం: ఈనెల 24న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ ప్రసాద్ తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షురాలు దారం అమ్ములమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష జరుగుతుందని వివరించారు.

పూత, పిందె రాలకుండా చర్యలు తీసుకోవాలి



దాచేపల్లి: పత్తి పంటలో పూత, పిందె రాలకుండా చర్యలు తీసుకోవాలని ఏఓ డి.పాపకుమారి చెప్పారు. గామాలపాడులో పత్తి పంటలను గురువారం ఆమె పరిశీలించారు. పత్తి పంటలో పూత, పిందె రాలడాన్ని ఏఓ గమనించారు. దీని నివారణకు బోరాన్ పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. సూక్ష్మపోషకాల లోపానికి ఎఫ్4/ఎఫ్6 స్ప్రే చేయాలని చెప్పారు. పత్తి పంటలో సూక్ష్మపోషకాల లోపానికి మెగ్నీషియం సల్ఫేట్, 2 శాతం ద్రావణాన్ని కలిపి పిచికారీ చేయాలని పేర్కొన్నారు. నిర్ణీత గడువులోగా ఈకేవైసీ, ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని చెప్పారు. పరిశీలనలో వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి ఉన్నారు.

పంట నమోదు చేయించుకోవాలి



పిడుగురాళ్ల: రైతులు తాము సాగుచేసే పంటను నమోదు చేయించుకోవాలని ఏఓ నందిపాటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఏఓ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని రైతులందరూ తమ పంటలకు సంబంధించి ఈ పంట నమోదు కార్యక్రమంతోపాటు ఈకేవైసీ కూడా తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. పంట నమోదు చేయించుకున్న వారు మాత్రమే ప్రభుత్వం అందించే పలు రకాల పథకాలు, రాయితీలకు అర్హులవుతారని తెలిపారు. ఈ-పంట నమోదుకు ఈ నెల 23వ తేదీ వరకు అవకాశం ఉందని, క్షేత్రస్థాయి సిబ్బంది రైతులకు సంబంధించిన పంట నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని తెలిపారు.

సేంద్రియ ఎరువులతోనే అధిక దిగుబడులు



రెంటాల(రెంటచింతల): సేంద్రియ ఎరువులతో సేద్యం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి చెప్పారు. గురువారం మండలంలోని రెంటాల గ్రామంలో ఆయన రైతులకు సేంద్రియ సాగుపై అవగాహన కల్పించారు. సూచనలు, సలహాలు ఇచ్చారు. దుక్కులు దున్నడం, విత్తనశుద్ధి వల్ల ప్రయోజనాలను వివరించారు. తెగుళ్ల వ్యాప్తి, నివారణపై సలహాలు ఇచ్చారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

అచ్చంపేట: స్థానిక టీఎస్సార్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు గురువారం నిర్వహించారు. హెచ్‌ఎం చిగురుపాటి కల్యాణి క్రీడలను ప్రారంభించారు. పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఆలపాటి సుజాత మాట్లాడుతూ మండలంలోని ఏడు జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి 240 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు తెలిపారు. పోటీలు రెండు రోజులు జరుగుతాయని పేర్కొన్నారు. మొదటి రోజు అండర్ 14, 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా, చెస్ పోటీలు నిర్వహించి, జట్లను ఎంపిక చేసినట్లు చెప్పారు. శుక్రవారం అథ్లెటిక్ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు

క్రోసూరు: పారుపల్లి గ్రామానికి చెందిన రమేష్ అనే యువకుడు కనిపించడం లేదని తండ్రి పారుపల్లి వెంకటేశ్వర్లు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కె.నాగేంద్రరావు తెలిపారు. కూలీ పనులు చేస్తున్న రమేష్ గత నెల 30 ఇంటి నుంచి కూరగాయలు తీసుకుని రావడానికని వెళ్లి తిరిగి రాలేదు. మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు 94407 96235, పోలీసు స్టేషన్‌కు నంబరు 08640-227133కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

‘చెత్త’ నిర్వహణ

- సంపద తయారీ కేంద్రాలకు గ్రహణం
- రూ.లక్షల ప్రజాధనం వృథా
- పట్టించుకోని అధికారులు
- గ్రీన్ అంబాసిడర్లకూ జీతాల్లేవు

దాచేపల్లి: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ చెత్తగా ఉంది. ఫలితంగా అవి నిరుపయోగంగా మారాయి. లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అయింది. విలువైన యంత్రాలు తుప్పుబట్టి ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయి. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను 2014-19 మధ్యలో అప్పటి టీడీపీ ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించింది. దాచేపల్లి నగర పంచాయతీతో పాటుగా మరో 13 గ్రామాల్లో సంపద కేంద్రాలను నిర్మించింది. ఒక్కో కేంద్రానికి సగటున రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు నిధులు కేటాయించింది. దాచేపల్లి, నడికుడి గ్రామాల్లోని కేంద్రాలకు మరో రూ.10 లక్షలతో యంత్రాలనూ కొనుగోలు చేసింది. గ్రీన్ అంబాసిడర్లను నియమించి పంచాయతీల్లో సేకరించిన చెత్తను సంపద కేంద్రాలకు తరలించి తడి, పొడి చెత్తగా వేరుచేసి తడి చెత్తతో సేంద్రియ ఎరువులు తయారు చేయడంతోపాటు పొడి, ప్లాస్టిక్ వ్యర్థాలను అమ్మి సంపద సృష్టించడమే లక్ష్యంగా ఈ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. అయితే కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం, నిర్వహణ లోపం వల్ల లక్ష్యం నెరవేరలేదు. కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. చుట్టూ పిచ్చిమొక్కలు మొలిచి అసాంఘిక కార్యకలాపాలకు వేదికవుతున్నాయి. పైగా దాచేపల్లి, నడికుడి గ్రామాల్లోని కేంద్రాలకు తీసుకొచ్చిన యంత్రాలు అమర్చకుండా వదిలేయడంతో తుప్పుబట్టి మూలన పడ్డాయి. ఇదిలా ఉంటే సంపద కేంద్రాలకు చెత్తను తరలించే గ్రీన్ అంబాసిడర్లకు ఆరునెలలుగా వేతనాలు అందడం లేదు. వీరికి ప్రతినెలా రూ.6వేలు చొప్పున రావాలి. ఫలితంగా వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులను అడిగితే ప్రభుత్వం విడుదల చేయాలని చెబుతున్నారని, వెంటనే మంజూరు చేయాలని కోరుతున్నారు.



పిచ్చిచెట్లు ఏపుగా పెరిగి అధ్వానంగా ఉన్న కేసానుపల్లిలోని సంపద తయారీ కేంద్రం

కేంద్రాల పనితీరు మెరుగుపరుస్తాం

సంపద తయారీ కేంద్రాల పని తీరును మెరుగుపరుస్తాం. ఇళ్లలో సేకరించిన చెత్తచెదారాన్ని కేంద్రాలకు తీసుకెళ్లి సేంద్రియ ఎరువులు తయారు చేస్తాం. సంపద సృష్టించేలా చర్యలు చేపడతాం. గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు త్వరలోనే చెల్లిస్తాం.

– శోభారాణి, ఎంపీడీఓ, దాచేపల్లి



నడికుడిలో నిరుపయోగంగా ఉన్న కేంద్రం



తంగెడ కేంద్రంలో మద్యం సీసాలు



నడికుడి కేంద్రంలో మూలన పడి ఉన్న యంత్రాలు

‘స్వచ్ఛం’దంగా కదులుదాం



తాళ్లపల్లిలో స్వచ్ఛతాహీ కార్యక్రమం విశిష్టతను వివరిస్తున్న ఎంపీడీఓ సరోజినీదేవి



మాచర్ల 24వ వార్డులో పారిశుద్ధ్య పనులు చేస్తున్న పురపాలక సంఘ సిబ్బంది

మాచర్ల/మాచర్ల రూరల్: మన ఊరు మన శుభ్రత అందరి బాధ్యతని, దీనికోసం స్వచ్ఛందంగా కదులుదామని పలువురు పేర్కొన్నారు. గురువారం పలు ప్రాంతాల్లో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలు జరిగాయి. తాళ్లపల్లి గ్రామంలో మాచర్ల ఎంపీడీఓ కె.సరోజినీదేవి ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కోటేశ్వరరావు, సర్పంచ్ బ్రహ్మానాయుడు, కార్యదర్శి ఆవుల వెంకట్రామయ్య పాల్గొన్నారు.

- మాచర్ల పట్టణంలోని 24వ వార్డులో పారిశుద్ధ్య పనులను మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. వార్డులో కమిషనర్ పర్యటించి సిబ్బందికి పలు ఆదేశాలిచ్చారు. పిచ్చి మొక్కల తొలగింపు, కాల్వలలో పూడిక తీయించటంతోపాటు పలు పనులు చేయించారు.

కేసానుపల్లిలో పారిశుద్ధ్య పనులు

దాచేపల్లి: మండలంలోని కేసానుపల్లి గ్రామంలో పారిశుద్ధ్య పనులు గురువారం చేపట్టారు. మురికి కాలువలు, రోడ్ల వెంట పెరిగిన చెట్లను జేసీబీ ద్వారా తొలగించారు. ట్రాక్టర్ల ద్వారా చెత్తచెదారాన్ని డంపింగ్ యార్డుకు తరలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టామని, కాలువల్లో బ్లీచింగ్ చల్లించామని పంచాయతీ కార్యదర్శి నాగెండ్ల రత్నం చెప్పారు. ఈ పనులను సర్పంచ్ ప్రసాదరావు, ఎంపీటీసీ చెట్టిపోగు ఏసుదాసు తదితరులు పర్యవేక్షించారు.



కేసానుపల్లిలో చెత్తచెదారం తొలగిస్తున్న దృశ్యం

యూటీఎఫ్ ‘ఖేలా’హలం



క్రీడలను ప్రారంభిస్తున్న హైస్కూల్ హెచ్‌ఎం లింగాల ధనలక్ష్మి, ఉపాధ్యాయినులు

పిడుగురాళ్ల మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం యూటీఎఫ్ స్వర్ణోత్సవ క్రీడా సంబరాలు అట్టహాసంగా జరిగాయి. ఉపాధ్యాయినులు ఆటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. తొలుత పాఠశాల హెచ్‌ఎం లింగాల ధనలక్ష్మి, మోర్జంపాడు హైస్కూల్ హెచ్‌ఎం పద్మాబాయిలతోపాటు యూటీఎఫ్ సహ అధ్యక్షురాలు రాజేశ్వరిదేవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విజయకమల ముఖ్యఅతిథులుగా పాల్గొని ఆటల పోటీలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఉపాధ్యాయినులు పరుగు పందెం, లెమన్ అండ్ స్పూన్, మ్యూజిక్ చైర్ వంటి పోటీల్లో ప్రతిభ చూపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు విజయసారథి, జమాల్, వి.నాగేశ్వరరావు, ఆనంద్‌కుమార్, శ్రీనివాసరావు, సాంబశివరావు, సాయిబాబా, మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు. – పిడుగురాళ్ల



లెమన్ అండ్ స్పూన్ ఆడుతున్న టీచర్లు



కుర్చీలాట ఆడుతున్న ఉపాధ్యాయినులు

వరద బాధితులకు రూ.20 లక్షల విరాళం

దాచేపల్లి: మండలంలోని శ్రీనగర్ గ్రామానికి చెందిన టెక్నో పెయింట్స్ ఫౌండర్, మేనేజింగ్ డైరెక్టర్ ఆకూరి శ్రీనివాసరెడ్డి వరద బాధితుల సహాయార్థం రూ.20 లక్షల విరాళాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేశారు. శ్రీనగర్‌కి చెందిన శ్రీనివాసరెడ్డి టెక్నో పెయింట్స్‌ని హైదరాబాద్‌లో నెలకొల్పారు. తెలంగాణలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. వరద బాధితులకు అండగా ఉండేందుకు టెక్నో పెయింట్స్ ముందుకు వచ్చింది. ఈ నేపథ్యంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన క్యాంప్ కార్యాలయంలో కలిసి వరద బాధితుల సహాయార్థం చెక్‌ను శ్రీనివాసరెడ్డి అందించారు. విరాళం అందజేసిన శ్రీనివాసరెడ్డిని సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. వరదల వలన నిరాశ్రయులైన బాధితులకు అండగా ఉండేందుకు టెక్నోపెయింట్స్ ఈ విరాళాన్ని అందజేసిందని, తమ కంపెనీ తరుపున బాధితులకు అండగా ఉంటామని శ్రీనివాసరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో టెక్నో పెయింట్స్ వైస్ చైర్మన్ సీవీఎల్‌ఎన్. మూర్తి, సీవో అనిల్ ఉన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డికి చెక్‌ను అందజేస్తున్న టెక్నో పెయింట్స్ ఎండీ ఆకూరి శ్రీనివాసరెడ్డి

మొబైల్ షాపుల ఓనర్స్ సంఘం అధ్యక్షునిగా పాండురంగ ప్రసాద్

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల మొబైల్ షాపుల ఓనర్స్ అసోసియేషన్ కొత్త కమిటీని గురువారం ఎన్నుకున్నారు. పట్టణంలోని రఘురామ్ మినీ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సమావేశంలో కొత్త కమిటీ అధ్యక్షులుగా జి.పాండురంగ ప్రసాద్, ఉపాధ్యక్షులుగా పఠాన్ సైదా, ప్రధాన కార్యదర్శిగా నారాయణ, జాయింట్ సెక్రటరీగా షేక్ ఇస్మాయిల్, ట్రెజరర్‌గా కిరణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పిడుగురాళ్ల పట్టణ మొబైల్ షాపుల ఓనర్స్ పాల్గొన్నారు.



మొబైల్ షాపుల ఓనర్స్ సంఘ కొత్త కార్యవర్గం

గురవయ్య సేవలు చిరస్మరణీయం



మాచర్ల: పల్నాటి ప్రాంతంలో ఆర్‌ఎంపీగా పని చేసి పట్టణంలో కౌన్సిలర్‌గానూ ప్రజలకు సేవలందించిన పల్లెబోయిన గురవయ్య చిరస్మరణీయులని మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు అన్నారు. గురువారం పట్టణంలో గురవయ్య సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ గురవయ్య ప్రజలకు ఎన్నో సేవలందించారని కొనియాడారు. సంస్మరణ సభలో న్యాయవాదులు కేళం శ్రీనివాసరావు, మదార్‌సాహెబ్, బీసీ సంఘం రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ జింకల నాగేశ్వరరావు, పలువురు ఆర్‌ఎంపీలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

షిరిడి సాయిబాబాకు ప్రత్యేక పూజలు



పాలువాయి జంక్షన్(రెంటచింతల): పాలువాయి జంక్షన్ వద్ద ఉన్న షిరిడి సాయి ఆలయంలో గురువారం ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో భక్తులు సాయిబాబాకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో భజనా బృందం బాబా గీతాలను ఆలపించింది. పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ చైర్మన్ పందిరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు



మాచర్ల: పట్టణంలోని నాగార్జున కళామందిర్ సమీపంలోని మ్యాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అధినేత, కంటి వైద్యులు రామలింగారెడ్డి ఆధ్వర్యంలో బస్టాండ్ ఎదురు కృష్ణవేణి జూనియర్ కాలేజీలో గురువారం ఉచిత కంటి వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్రామయ్య మాట్లాడుతూ విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించటం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, కళాశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏసీడీపీఓ సంతోషికుమారి



అచ్చంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు

మాదల(ముప్పాళ్ళ): మాదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని కిశోర బాలికలకు పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా గురువారం రక్త హీనతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీఓ సంతోషి కుమారి పాల్గొని రక్తహీనత, వ్యక్తిగత పరిశుభ్రత, పోషణ మొదలైన వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ జి.జయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి జి.శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పీ పావని, ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకుకూరల్లో అధిక పోషకాలు

అచ్చంపేట: ఆకు కూరల్లో అధిక పోషకాలు ఉంటాయని వాటితో పాటు కిశోర బాలికలకు చిరుధాన్యాలు, బెల్లం వంటి పదార్థాలను ఇవ్వాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఎస్ మాణిక్యమ్మ తెలిపారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా గురువారం కిశోర బాలికలతో అచ్చంపేటలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. 11 నుంచి 14 సంవత్సరాలలోపు బాలికలు రక్తహీనతకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పౌష్టికాహారం తయారీని వివరించారు. బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆటల పోటీలు నిర్వహించారు.

మధిరలో పుట్లగూడెం యువకుడి ఆత్మహత్య



మృతుడు రఘువర్మ(ఫైల్)

అచ్చంపేట: మండలంలోని పుట్లగూడెం గ్రామానికి చెందిన చెట్టి రఘువర్మ(22) తెలంగాణలోని ఖమ్మం జిల్లా మధిరలో గురువారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తుల సమాచారం మేరకు మృతుని తండ్రి నాగరాజు గ్రామంలో చిన్న కిరాణా దుకాణం నిర్వహిస్తున్నాడు. పెద్దవాడైన రఘువర్మ మధిరిలోని అమ్మమ్మ ఇంటిలో ఉంటూ డిగ్రీ చదువుతున్నాడు. అయితే అతని ఆత్మహత్యపై గ్రామస్తులు విభిన్న అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

క్రోసూరు: కర్నూలు జిల్లా కల్లుగుంట గ్రామంలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన గోవిందమ్మను వివస్త్రను చేసి, అవమానించిన వారిని కఠినంగా శిక్షించాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గార్లపాటి దాసు గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దాసు మాట్లాడుతూ గోవిందమ్మ కుమారుడు గ్రామంలోని రజక సామాజిక వర్గానికి చెందిన అమ్మాయిని ప్రేమించి, పెళ్లి చేసుకున్నారని తెలిపారు. ఇది సహించలేని కొందరు గోవిందమ్మను వివస్త్రను చేసి ఊరంతా నగ్నంగా తిప్పి స్తంభానికి కట్టివేసి కొట్టి సభ్య సమాజం తలదించుకొనేలా చేశారని తెలిపారు. పోలీసు అధికారులు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మాదలలో యువకుల ఘర్షణ

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామంలోని రెండు సామాజిక వర్గాలకు చెందిన యువకుల మధ్య వివాదం ముదిరి ఘర్షణకు దారితీసింది. ఈ ఘటన బుధవారం అర్ధరాత్రి జరిగింది. ఒక సామాజిక వర్గానికి చెందిన వినాయకుని నిమజ్జన ఊరేగింపు సమయంలో డ్యాన్స్ వేసే విషయంలో రెండు వర్గాల యువకుల మధ్య వివాదం రేగింది. యువకులు ఘర్షణ పడ్డారు. జాకీర్, హుస్సేన్ తలకు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. బాధితులు ఫిర్యాదు మేర కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సోమేశ్వరరావు తెలిపారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం



మాచర్ల: క్రీస్తు బోధనలు అనుసరణీయమని గుంటూరుకు చెందిన పాస్టర్ పీటర్‌పాల్, చైన్నైకి చెందిన బోధకులు జాన్ హెడ్ అన్నారు. పట్టణంలోని రింగురోడ్డు సమీపంలో మిస్సమ్మ హాస్పిటల్ ఆవరణలో లెమెన్స్ ఇవాంజికల్ ఫెలోషిప్ చర్చి ఆధ్వర్యంలో గురువారం రాత్రి క్రీస్తు సువార్త స్వస్థత కూటములు నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్లు క్రీస్తు సందేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో సంఘ కాపరి నట్టువ ప్రభాకర్, రత్నంతోపాటు వందలాది మంది క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.

మండలస్థాయి క్రీడాకారుల ఎంపిక

పెదకూరపాడు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల, జి.ఆర్.సి.కె పాఠశాలల్లో గురువారం మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు జరిగాయి. క్రీడాకారులు పలు ఆటల్లో హోరాహోరీగా తలపడ్డారు. హెచ్‌ఎం కాకాని వెంకటరమణ, జీఆర్‌సీకే డైరెక్టర్ రాము, పెదకూరపాడు నియోజకవర్గ స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ నాగరాజు పర్యవేక్షించారు. ఉపాధ్యాయులు సాంబశివరావు, అరుణశ్రీ, పూర్ణ, ఎం.అజయ్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్ వద్ద విజయవాడ రోడ్డుపై పారుతున్న మురుగు నీరు



అమరావతిలో దుర్గంధం

అమరావతి: ప్రపంచ ప్రసిద్ధి గాంచిన పర్యాటక కేంద్రం అమరావతిలో రోడ్లపై మురుగునీరు పారుతోంది. ఇటీవల వచ్చిన వరదలకు స్థానిక విజయవాడ రోడ్డులోని ఎస్సీ వసతి గృహం వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డు అడుగున తూములు పూడిపోయాయి. దీంతో ఎగువ నుంచి వచ్చే మురుగు రోడ్డుపై నుంచి పారుతోంది. చుట్టు పక్కల వారిని అక్కడి నుంచి వచ్చే దుర్గంధం, తద్వారా విపరీతమైన దోమల ఉధ్రుతి రోగాల బారిన పడేస్తోంది. అమరావతి-విజయవాడ రోడ్డుపై మోకాలి లోతు గుంతల్లో పడి తరచూ ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఎగువన వైకుంఠపురం సమగ్ర తాగునీటి పథకం నుంచి వచ్చే మురుగు నీరంతా దిగువకు వస్తున్నందున తాము ఇబ్బందులు పడుతున్నామని గోపాల్ నగర్ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలే శిథిలావస్థలో ఉన్న ఎస్సీ కాలనీ భవనాలు ప్రహారీలు లేక మురుగు నీరు నిల్వతో మరింత బలహీన పడుతున్నాయని నివాసితులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, మురుగు నీటికి అడ్డుకట్ట వేసి, తూముల పూడిక తీయించాలని స్థానికులు కోరుతున్నారు.